సాక్షి
మంచిర్యాల

సోమవారం । 24 । ఫిబ్రవరి । 2025



ప్రాచీన కళకు ప్రాణం

8లో▸

చెన్నూర్ మండలంలోని పలు గ్రామాల కళాకారులు చిరుతల రామాయం రక్షణకు శ్రీకారం చుట్టారు. రామాయణంలోని వివిధ పాత్రలు పోసించేందుకు శిక్షణ పొందుతున్నారు.



బాసరలో భక్తుల రద్దీ

8లో▸

నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మ వారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు.

గరిష్ఠం/కనిష్ఠం
35.5 /20.2

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది. అర్ధరాత్రి తర్వాత చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా టీజీసెట్

- 99 శాతం మంది హాజరు



హాల్‌టికెట్‌లను సరిచూస్తున్న ప్రిన్సిపాల్

బెల్లంపల్లి: గురుకుల విద్యాసంస్థల్లో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన టీజీసెట్ -2025 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 5వ తరగతి ,6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల్లో 99 శాతం మంది పరీక్షలకు హాజరయ్యారు. జిల్లాలో మొత్తం 11 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమై పరీక్ష మధ్యాహ్నం 1 గంటవరకు జరిగింది. ఆయా పరీక్ష కేంద్రాల్లో మొత్తం 5,035 మంది విద్యార్థులను అలాట్‌మెంట్ చేయగా 4,885 మంది విద్యార్థులు హాజరయ్యారు. 150 మంది గైర్హాజర్ అయ్యారు. సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ పెద్దపల్లి జోనల్ అధికారి అరుణకుమారి బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీవోఈ)పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.

విద్యార్థులకు కరాటే నేర్పించాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరగౌడ్

మందమర్రిరూరల్: పాఠశాలల్లో విద్యార్థులకు కరాటే నేర్పించాలని, ప్రతీ పాఠశాలలో తప్పనిసరి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వరగౌడ్ అన్నారు. మందమర్రి పట్టణంలోని సీఐఎస్ఎఫ్ బ్యారక్స్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కరాటే పోటీలను ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి దశలో కరాటే నేర్చుకోవడం ద్వారా దేహదారుఢ్యంతోపాటు ధైర్య సాహసాలు అలవడుతాయని తెలిపారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు రంగు శ్రీనివాస్, బీజేపీ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి దుర్గం అశోక్, దీక్షితులు, నరేశ్, రవిసాగర్, రమేశ్, కరాటే మాస్టర్స్ పాల్గొన్నారు.

'ఎన్నికల్లో ధన రాజకీయాలను ఓడించాలి'

మంచిర్యాలఅర్బన్: రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ధన రాజకీయాలను ఓడించి ప్రజాస్వామ్యం, ప్రభుత్వ విద్యారంగాన్ని గెలిపించుకుందామని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా టీఎస్‌యూటీఎఫ్ బలపర్చిన టీపీటీఎఫ్ అభ్యర్థి ఆశోక్‌కుమార్ తరఫున మంచిర్యాలలో ప్రచారం చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఉపాధ్యాయ, మేధావివర్గం ఉద్దేశించినవి కానీ, ప్రస్తుతం రియల్‌ఎస్టేట్ వర్గాలను, కార్పొరేట్ వ్యవస్థలను కాపాడుకోవడానికి పూనుకున్న వ్యక్తులు వ్యవస్థలోకి వస్తున్నారన్నారు. అలాంటి వ్యక్తులను ఎన్నికల్లో గెలిపిస్తే ఉపాధ్యాయ రంగం, హక్కులను కాలరాసుకున్నవాళ్లమవుతామన్నారు. ఉపాధ్యాయ లోకం విజ్ఞతతో ఆలోచించి వై.అశోక్‌కుమార్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చక్రపాణి, రాజావేణు, ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, కార్యదర్శులు దేవదాస్, నర్సయ్య, పూర్వ జిల్లా అధ్యక్షుడు రామన్న, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, తులసిపతి, దిలీప్ తిరుపతి పాల్గొన్నారు.

'బొగ్గుపెళ్లలు' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో కవులు, రచయితలు

మంచిర్యాలఅర్బన్: సింగరేణి కార్పొరేట్ కార్యాలయంలో ఎస్టేట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న అల్లం సుధాకర్ రచించిన బొగ్గుపెళ్లలు కవితా సంపుటిని కవి మలయశ్రీ ఆదివారం ఆవిష్కరించారు. మంచిర్యాల చార్వాక ట్రస్టు హాల్‌లో సాహితీ సంరక్షణ సమితి అధ్యక్షుడు వామన్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వరంగల్ జిల్లా అరసం ప్రధాన కార్యదర్శి డాక్టర్ మార్క శంకర్ పుస్తక సమీక్ష చేశారు. సమాజహితమే ప్రధాన ధ్యేయంగా పుస్తకంలో తన ఉద్యోగ ప్రస్థానం, సింగరేణితో అనుభంధం, కవులు, రచయితలు, కార్మికుల, కర్షకుల బాధలతో వచన సంపుటిలో ఆవిష్కరించారని వక్తలు అభిప్రాయపడ్డారు. పుస్తకా రచయితను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హన్మంతరావు, అరసం అధ్యక్షుడు పల్లేరు వీరస్వామి, రంగు రాజేశం తదితరులు పాల్గొన్నారు.

పట్టం కట్టేలా..

- ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్
- క్యాడర్‌లో ఊపు తెచ్చేలా నస్పూర్‌లో ప్రచార సభ
- నేడు జిల్లాకు రానున్న సీఎం రేవంత్‌రెడ్డి



సభా స్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంచిర్యాల జిల్లాలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పట్టు సాధించింది. మంచిర్యాల, చెన్నూర్ అసెంబ్లీ స్థానాలతోపాటు లోక్‌సభ ఎన్నికల్లో పెద్దపల్లి స్థానంలో విజయం సాధించింది. పార్లమెంటు పరిధిలోని ధర్మపురి, మంథని, పెద్దపల్లి, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. ఈనేపథ్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ పట్టు నిలుపుకునేలా.. ఈ నియోజకవర్గాల నుంచి మెజారిటీ పట్టభద్రులను కాంగ్రెస్‌వైపు తిప్పుకునేలా హస్తం నేతలు పావులు కదుపుతున్నారు. ఇప్పటికే విస్తృతంగా ప్రచారం చేస్తున్న నేతలు.. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి కూడా రంగంలోకి దిగుతున్నారు. ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గం బరిలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డి గెలుపు కోసం నస్పూర్‌లోని కలెక్టరేట్ సమీప మైదానంలో ప్రచారం సభ ఏర్పాటు చేశారు. సీఎం హోదాలో తొలిసారిగా మంచిర్యాలకు వస్తున్న నేపథ్యంలో పార్టీ నాయకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సీఎల్పీనేతగా పాదయాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగసభలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ పాల్గొన్నారు. ఆ తర్వాత మొదటి సారిగా ఇక్కడికి వస్తున్న నేపథ్యంలో బహిరంగ సభను విజయవంతం చేసేందుకు నేతలంతా శ్రమిస్తున్నారు.

12 వేల మంది పట్టభద్రులతో సభ

సీఎంతోపాటు మంత్రులు, రాష్ట్రస్థాయి నాయకులు సభకు హాజరుకానున్నారు. ఈ సభకు 12వేల పట్టభద్రులను తరలించేలా మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ఆదివారం నుంచే ప్రయత్నాలు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాతోపాటు సమీప ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పట్టభద్రులను సభకు రప్పించే ఏర్పాటు చేశారు. సీఎం సభ నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతోపాటు రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. కలెక్టరేట్‌లోని హెలిప్యాడ్‌ను సిద్ధం చేశారు. డీసీపీ ఎ.భాస్కర్ నేతృత్వంలో సభాస్థలి, పార్కింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఒక రోజు ముందే నిర్ణయం

సీఎం బహిరంగ సభ ఒకరోజు ముందే ఖరారైంది. ముందు అనుకున్న షెడ్యూల్ ప్రకారం నిర్మల్‌లో సీఎం పాల్గొనాల్సి ఉంది. అయితే అక్కడ రద్దు చేసుకుని, ఇక్కడ ఏర్పాటు చేశారు. సాధారణంగా ముఖ్యమంత్రి స్థాయి బహిరంగ సభకు రెండు, మూడు రోజుల ముందే స్థానిక అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులకు సమాచారం వస్తుంది. అందుకు భిన్నంగా జరిగింది. ఒక రోజే సమయం ఉండడంతో అధికారులు, పోలీసులు, ఎమ్మెల్యేలు, నాయకులు ఆగమేఘాల మీద ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఊపు తెచ్చేలా..

ఎమ్మెల్సీ ఎన్నికలను అధికార కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పార్టీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు స్వయంగా సీఎం రేవంత్‌రంగంలోకి దిగారు. ఆత్మీయ సమ్మేళనాల పేరుతో ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గాల్లో సభలు నిర్వహిస్తున్నప్పటికీ కొందరు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులే దూరంగా ఉంటున్నారు. కొన్నిచోట్ల అసంతృప్తులతో వర్గపోరు సాగుతోంది. ఇదంతా ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రభావం పడకుండా, ప్రత్యర్థులకు చెక్ పెడుతూ కేడర్‌లో ఊపు తెచ్చేలా ఈ సభ నిర్వహిస్తున్నారు. పార్టీ అభ్యర్థిని గెలిపించాలని సీఎం నేరుగా పట్టభద్రులను కోరనున్నారు.

ఇదీ సీఎం షెడ్యూల్

ఉదయం 11 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి హెలిక్యాప్టర్‌లో బయలు దేరుతారు. 11.45గంటలకు నిజామాబాద్‌కు చేరుకుని అక్కడ 11.50 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సభలో పాల్గొంటారు. అక్కడి నుంచి 2.15 గంటలకు మంచిర్యాలకు వచ్చి 2.20 నుంచి 3.55 వరకు సభకు హాజరవుతారు. 4 గంటలకు కరీంనగర్‌కు బయలుదేరి వెళ్తారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు

నస్పూర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డి తరఫున ప్రచారం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం జిల్లాకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో నస్పూర్‌లో సభ ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఈ సభకు సీఎం రేవంత్‌రెడ్డితోపాటు పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు హాజరవుతారని వివరించారు. సభకు 12 వేల మంది గ్రాడ్యుయేట్లతోపాటు 30 వేల మంది హాజరవుతారని తెలిపారు. అనంతరం సభా స్థలిని మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్ పరిశీలించారు.

'మాటకు కట్టుబడి పనిచేస్తున్నాం'

మంచిర్యాలటౌన్: అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు, మాటకు కట్టుబడి పనిచేస్తున్నామని, తాను హామీలతో పాటు, ప్రజల అవసరాన్ని గుర్తించి, వాటిని కూడా అమలు చేస్తూ ముందుకు వెళుతున్నానని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖలతో కలిసి ఆదివారం మాట్లాడారు. మంచిర్యాల నియోజకవర్గంలోని ప్రజలకు తాగునీరు అందించడంతోపాటు, ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందిస్తున్నామన్నారు. ప్రజలకు ఉపయోగపడేలా ఎంసీహెచ్ ఉండాలని తాను ఇచ్చిన హామీ మేరకు ఐబీ ఆవరణలో ఎంసీహెచ్‌తో పాటు, హామీ ఇవ్వని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం చేపడుతున్నామన్నారు. మహాప్రస్థానంను గ్రీనరీగా నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

పోలింగ్ రోజు సెలవు ఇవ్వాలి

శ్రీరాంపూర్: ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఓటింగ్ రోజు సింగరేణి కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచి ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండి రమేశ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పొగాకు రమేశ్, అన్వేశ్‌రెడ్డి కోరారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓటింగ్ జరిగే రోజు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు సెలవు ఇవ్వాలన్నారు. సింగరేణిలో ఉన్న గ్రాడ్యుయేట్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా సెలవు ఇవ్వాలని పేర్కొన్నారు.

తెలుగుకు ప్రత్యేక హోదా కల్పించాలి

మంచిర్యాలఅర్బన్: తెలుగు భాషకు ప్రత్యేక హోదా కల్పించాలని కవి మలయశ్రీ అన్నారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. మలయశ్రీ హాజరై మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి యువతకు తెలుగుపై నమ్మకం కలిగించాలన్నారు. తెలుగును ప్రేమించే దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలని సూచించారు. సాహితీ సంస్థ అధ్యక్షుడు వామన్‌రావు, కవులు చంద్రశేఖర్, రూపాచారి, సత్తయ్య, శ్రీనివాస్ తెలుగు భాషపై ఆలపించిన కవిత్వాలు అలరించాయి.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలి

మంచిర్యాలఅర్బన్: పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మంచిర్యాల మార్క్స్ భవన్‌లో పీడీఎస్‌యూ జిల్లా సమావేశం ఆదివారం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్, మెస్ చార్జీలు, కళాశాలలో మధ్యాహ్న భోజనం అమలు, ప్రభుత్వ విద్య సంస్థలను బలోపేతం చేస్తామనే కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఎన్నికలపై ఉన్న శ్రద్ధ విద్యారంగంపై లేదని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో జిల్లా నాయకులు సికందర్, కార్తీక్, వంశీ, సంతోష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రెండూ ఒక్కటే..!



సభకు హాజరైన నాయకులు, పట్టభద్రులు



సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పరస్పర అవగాహన
- అందుకే బీఆర్‌ఎస్ అభ్యర్థులను నిలబెట్టలేదు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

రామకృష్ణాపూర్: 'కాంగ్రెస్–బీఆర్‌ఎస్ పార్టీలు రెండు ఒక్కటే.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు అవగాహన ఉంది.. అందుకే బీఆర్‌ఎస్ అభ్యర్థులను నిలబెట్టలేదు' అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా క్యాతనపల్లిలోని ఎంఎన్‌ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం సాయంత్రం పార్టీ జిల్లా ప్రభారీల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సంజయ్ హాజరై మాట్లాడారు. ఢిల్లీలో గెలిచిన ఊపులో ఉన్న బీజేపీని ఇక్కడి మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిస్తే.. అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా అధికారం బీజేపీదే అని ధీమా వ్యక్తంచేశారు. అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. రూ.4 వేల ఆసరా పెన్షన్, ఆడపిల్ల పెళ్లికి తులం బంగారం, 2 లక్షల మందికి ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి రూ.4 వేలు తదితర హామీలన్నీ అటకెక్కించారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలను పక్కదోవ పట్టించేందుకు కాళేశ్వరం ప్రాజెక్టులో అవతవకలు, ఈ ఫార్ములా రేసు, డ్రగ్స్ కేసు వంటివి తెరపైకి తెచ్చారని ఆరోపించారు.

ఎందుకు అరెస్ట్ చేయడం లేదు..

అవినీతి కేసుల్లో ఆధారాలున్నా ఏ స్కాంలోనూ కేసీఆర్ కుటుంబాన్ని రేవంత్‌రెడ్డి ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలకు డబ్బులు ముట్టజెప్పిన కారణంగానే అరెస్ట్‌కు వెనకాడుతున్నారని ఆరోపించారు. బీజేపీ సింగరేణి ప్రైవేటుపరం కాకుండా కార్మికులకు అండగా నిలుస్తోందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు ట్యాక్స్ మినహాయింపు ఇచ్చి వారికి అండగా ఉంది కూడా బీజేపీనేనని స్పష్టంచేశారు. 317 జీవో కోసం కొట్లాడింది కూడా తమ పార్టీనే అని గుర్తుచేశారు. ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, రైతులు ఇలా అన్నివర్గాల పక్షాన బీజేపీ నిలుస్తుందని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలువాలని కొంతమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా కోరుకుంటున్నారని పేర్కొన్నారు.

సీఎం ప్రచారం చేసిన చరిత్ర ఉందా..?

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనటానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంచిర్యాలకు వస్తున్నారని, సీఎంస్థాయి వ్యక్తి ఎప్పుడైనా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న చరిత్ర ఉందా అని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న బీజేపీకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టం కట్టాలని కోరారు. దీనికి కార్యకర్తలంతా చిత్తశుద్ధితో పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంచందర్, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్, వెరబెల్లి రఘునాథ్, గోమాస శ్రీనివాస్, దుర్గం అశోక్, ఆరుముళ్ల పోశం తదితరులు పాల్గొన్నారు.

మతతత్వ రాజకీయాలు ప్రమాదకరం



మాట్లాడుతున్న కలవేణ శంకర్

నస్పూర్: బీజేపీ అవలంబిస్తున్న మతతత్వ రాజకీయాలు దేశానికి ప్రమాదకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్ అన్నారు. సీసీసీలోని నర్సయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన శ్రీరాంపూర్ శాఖ సమావేశంలో జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్‌తో కలిసి పాల్గొన్నారు. కార్మిక వర్గ ఉద్యమాలకు సీపీఐ కేంద్ర బిందువన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజల పక్షపాతిగా సీపీఐ పని చేస్తుందని తెలిపారు. సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్ అంటే పేద ప్రజల వికాసం కాకుండా కార్పొరేట్ కంపెనీల వికాసం మాత్రమే దేశంలో కొనసాగుతుందని విమర్శించారు. మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మేకల దాసు, లింగం రవి, పూజారి రామన్న, మిర్యాల రాజేశ్వర్ రావు, ముస్కె సమ్మయ్య, కొట్టె కిషన్‌రావు, కొత్తపల్లి మహేశ్, సంఘం సదానందం, సురేశ్, చిలుక రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

నేతకానీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: నేతకానీ మహర్‌లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నేతకానీ మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేశ్ అన్నారు. హైదరాబాద్‌లో ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును ఆదివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. కుల గణనలో తమ జనాభా శాతం తక్కువగా చూపించారని, ఎస్సీ వర్గీకరణలో సీ గ్రూపులో ఉంచారని తెలిపారు. తమను సీ గ్రూపులో కాకుండా ఎస్సీ డి గ్రూపు చేర్చాలని, ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నేతకాని, మహర్ సంక్షేమ సంఘం స్టీరింగ్ కమిటీ చైర్మన్ దుర్గం నర్సయ్య, పొలిట్‌బ్యూరో సభ్యుడు రాజేశ్, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భువన చంద్ర, మహిళా అధ్యక్షులు సోంబాయి, అధికార ప్రతినిధి జి.రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రం అందుకుంటున్న శ్రీకాంత్, రాజ్‌కుమార్

నేతకాని సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీకాంత్

పాతమంచిర్యాల/బెల్లంపల్లి: నేతకాని మహర్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా గోమాస శ్రీకాంత్ ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా దాగం వలీ హైదర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జాడి రాజ్‌కుమార్, అధికార ప్రతినిధిగా తాళ్లపల్లి రాజలింగు, జిల్లా కార్యవర్గసభ్యుడిగా ఆకుదారి రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరికి నేతకాని మహార్ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం స్వామి , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం సిద్దార్థ, రామ్మూర్తి నియామక పత్రాలు అందించారు.

మొక్కులు తీర్చుకుని దేవుడి చెంతకే..

- తీర్థయాత్రలకు వెళ్లివస్తూ మహిళ దుర్మరణం
- రోడ్డు దాటుతుండగా ఢీకొట్టిన కారు
- ఇంటికి రెండు కిలోమీటర్ల దూరంలో ఘటన



దుర్గమ్మ(ఫైల్)

తాండూర్: ఆమె కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. 12 ఏళ్ల క్రితం భర్త చనిపోయినా.. పిల్లలను పెంచి పెద్దచేసింది. ఉన్నంతలో అందరికీ పెళ్లిళ్లు జరిపించింది. ఇప్పటికీ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. దేవుళ్ల మొక్కులు ఉండడంతో వాటిని తీర్చుకునేందుకు పది రోజుల క్రితం గ్రామస్తులతో కలిసి పుణ్యక్షేత్రాలకు వెళ్లింది. దేవుళ్ల మొక్కులు తీర్చుకుని ఆదివారం సాయంత్రం గ్రామానికి చేరుకుంది. ఇంటికి 2 కిలోమీటర్ల దూరంలో.. మరో 15 నిమిషాలు అయితే ఇంటికి చేరుకునేది. 363 జాతీయ రహదారి దాటుతుండగా కారు రూపంలో వచ్చిన మృత్యువు కబళించింది. ఈ విషాద ఘటన తాండూర్ మండల కేంద్రంలో జరిగింది. ఎస్సై కిరణ్‌కుమార్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని కుమ్మరి వాడకు చెందిన వడాల దుర్గమ్మ(50) పది రోజుల క్రితం పుణ్యక్షేత్రాలకు వెళ్లింది. దేవుళ్లను దర్శించుకుని ఆదివారం సాయంత్రం 7 గంటలకు గ్రామ శివారులో బస్సు దిగింది. ఇంటికి వెళ్లేందుకు జాతీయ రహదారి 363 దాటేందుకు ప్రయత్నించింది. ఆసిఫాబాద్ నుంచి మంచిర్యాలవైపు వెళ్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన దుర్గమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. దుర్గమ్మకు ముగ్గురు కుమారులు వెంకటేశ్, రాజు, స్వామి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. సీసీ ఫుటేజీ ఆధారంగా కారును గుర్తించే ప్రయత్నం చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గట్టు మల్లన్నకు వెండి నాగ పడగ



నాగపడగ అందిస్తున్న తిమ్మారెడ్డి-నివేదితరెడ్డి

జైపూర్: వేలాల శ్రీగట్టు మల్లన్న స్వామికి రిటైర్డ్ అటవీశాఖ ఉన్నతాధికారి రూ.70 వేల విలువైన వెండి నాగపడగను అందించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్‌గా పనిచేసిన తిమ్మారెడ్డి మహాశివరాత్రి పర్వదినం నేపథ్యంలో కుటుంబ సమేతంగా ఆదివారం గట్టు మల్లన్న క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వెండి నాగపడగను పూజారులకు అందించారు. అనంతరం దొణ స్వయంభూగా వెలసిన శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. గుట్టపై నూతనంగా ఏర్పాటు చేసిన బోరును జనరేటర్ సహాయంతో ప్రారంభించారు.

ఆకట్టుకున్న రాష్ట్రస్థాయి యోగా పోటీలు



యోగా పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

మందమర్రిరూరల్: మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో డ్రీమ్ యోగా, ఫిట్‌నెస్ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్రస్థాయి యోగా పోటీలు నిర్వహించారు. ఏరియా జీఎం దేవేందర్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. మానసిక ప్రశాంతత కోసం యోగాను రోజులో భాగం చేసుకోవాలని సూచించారు. పేరెంట్స్ పిల్లలకు యోగాపై ఆసక్తి పెంచాలన్నారు. ప్రతీ పాఠశాలలో యోగా తరగతులు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఆసనాలు వేశారు. పోటీల్లో గెలిచిన వారికి నిర్వాహకులు ట్రోఫీ, షీల్డ్‌తోపాటు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఆలిండియా యోగా ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ పురోహిత్, తెలంగాణ యోగా అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్, యోగా థెరపిస్ట్ సత్యరెడ్డి, సొసైటీ వ్యవస్థాపకుడు, పోటీల నిర్వాహకులు ముల్కల్ల శంకర్, సాయితేజ, మద్ది శంకర్, బర్ల సదానందం, గంప అనిల్‌కుమార్, దామోదర్, రమేశ్‌రాజా, ఉమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

నర్సాపూర్ (జి): మండల కేంద్రం శివారు 61వ జాతీయ రహదారిపై బైకును గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు చికిత్స పొందుతూ మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. భైంసా పట్టణానికి చెందిన జంగ్మె సంతోష్, గౌతమ్ బైక్‌పై నిర్మల్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా నర్సాపూర్ (జి) గ్రామ శివారులో 61వ జాతీయ రహదారిపై శనివారం రాత్రి 11 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సంతోష్ ఆదివారం ఉదయం మరణించాడు. గౌతమ్ చికిత్స పొందుతున్నాడు. సంతోష్ అన్న కాశీనాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మందమర్రిలో బైక్ అదుపుతప్పి..

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి బైక్ అదుపుతప్పి ఒకరు మృతి చెందారు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని యాపల్ ఏరియాకు చెందిన షేక్ ముగ్దుం, షేక్ జిలానీ అన్నదమ్ములు. ఏరియాలోని కేకే ఓసీలో డ్రైవర్లుగా పని చేస్తున్నారు. ఆదివారం పని నిమిత్తం బైక్‌పై మంచిర్యాలకు వెళ్లి.. తిరిగి బెల్లంపల్లిలోని వాళ్ల మేనమామ ఇంటికి బయల్దేరారు. బైక్ అదుపుతప్పి కుడివైపున ఉన్న డివైడర్‌ను ఢీకొన్నారు. బైక్ నడుపుతున్న జిలానీ(30) అక్కడికక్కడే మృతిచెందగా, ముగ్దుం తీవ్రగా గాయపడ్డాడు. అతడిని బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..


సంతోష్ (ఫైల్)

కుభీర్: మండల కేంద్రానికి చెందిన సిందే సంతోష్ (30) హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 16న సంతోష్ తన అత్తగారి ఊరైన భైంసా మండలం సిద్దూరుకు బైక్‌పై వెళ్లాడు. తిరిగి సాయంత్రం వస్తుండగా సిద్దూరు దాటగానే ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టడంతో కిందపడ్డాడు. తల పగిలి తీవ్ర రక్తస్రావం కాగా, వెంటనే కుటుంబీకులు నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం హైదారాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడున్నారు.

నాటు కోళ్లు మృత్యువాత

భీమారం: మండల కేంద్రంలోని ఐటీడీఏ కాలనీలో పెంచుతున్న 50 నాటు కోళ్లు అంతు చిక్కని వ్యాధితో మృతి చెందాయి. కాలనీలో సాయికుమార్ స్వయం ఉపాధి కోసం తెచ్చి పెంచుతున్న 20 కోళ్లు ఆదివారం మృతి చెందగా, అంతకుముందు మరో 30 మరణించాయని తెలిపారు. ఇవే కాకుండా చాలా మంది ఇళ్లలో పెంచుతున్న కోళ్లు కూడా మరణిస్తున్నాయని స్థానికులు పేర్కొన్నారు.

ప్రాచీన కళకు ప్రాణం

- చిరుతల రామాయణం సాధనలో గ్రామీణులు
- నిష్టతో నేర్చుకుంటున్న కాచన్‌పల్లి కళాకారులు
- ప్రదర్శనతో భావితరాలకు మన సంస్కృతి


కాచన్‌పల్లిలో చిరుతల రామాయణం సాధన చేస్తున్న కళాకారులు


చిరుతల రామాయణంలో ఓ సన్నివేశం(ఫైల్)

చెన్నూర్‌రూరల్: టీవీలు వచ్చాక.. ప్రాచీన కళలకు ఆదరణ తగ్గింది. సెల్‌ఫోన్ ఆవిష్కరణ చూసేవారు తగ్గిపోయారు.. ఆన్‌డ్రాయిడ్ ఫోన్ అరచేతిలోకి వచ్చాక పరిస్థితి మరింత దిగజారింది. కళను చూసేవారే కాదు.. కళను పోషించేవారు తగ్గిపోతున్నారు. ఇలాంటి పరిస్థితిలో చెన్నూర్ మండలంలోని పలు గ్రామాల కళాకారులు చిరుతల రామాయం రక్షణకు శ్రీకారం చుట్టారు. రామాయణంలోని వివిధ పాత్రలు పోసించేందుకు శిక్షణ పొందుతున్నారు. తర్వాత ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతం కాచన్‌పల్లి వాసులు నెల రోజులుగా నిష్టతో సాధన చేస్తున్నారు.

నిష్టగా ఉంటేనే..

పల్లె కళాకారులకు గురువు చిరుతల రామాయణంలో సన్ని వేశాలు, మాటలు, పద్యాలలో శిక్షణ ఇస్తారు. ఇందులో అన్ని ప్రాతలు చేసేందుకుగాను సుమారు 25 మంది కళాకారులు శిక్షణ పొందుతారు. రామాయణంలో సన్నివేశాలు నేర్చుకునే సమయంలో నియమ, నిష్టలతో ఉంటారు. సుమారు నెల నుంచి రెండు నెలలు సాధన చేస్తారు. ఆ సమయంలో మద్యం, మాంసం ముట్టరు. తర్వాత ఎంపిక చేసిన గ్రామాల్లో చిరుతల రామాయణం ప్రదర్శిస్తారు.

సాధన, ప్రదర్శన రాత్రివేళలోనే..

ఇక చిరుతల రామాయణం సాధన, ప్రదర్శన రెండూ రాత్రి వేళలలోనే ఉంటాయి. ఉదయం రోజువారీ పనులకు ఆటంకం కలుగకుండా ఉండేందుకు రాత్రి సమయాన్నే ఎంచుకుంటున్నారు.

వారం రోజులు ప్రదర్శన..

చిరుతల రామాయణం ప్రతీ గ్రామంలో వారం రోజులు ప్రదర్శిస్తారు. ఇందులో ఆరు ఘట్టాలు ఉంటాయి. మొదటగా అయోధ్యకాండ, బాలకాండ, అరణ్యకాండ, కిష్కింధకాండ, సుందరకాండ, యుద్ధకాండ ఉంటాయి. రోజుకు ఒక కాండ చొప్పున ప్రదర్శిస్తుంటారు. బాల రాముడి నుంచి పట్టాభిషేకం వరకు ప్రదర్శన ఇస్తారు. ఈ ప్రదర్శనకు సుమారు రూ.3 లక్షల వరకు ఖర్చు అవుతుంది. కళాకారులు ఒక్కరికి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వేసుకుంటారు. అలాగే గ్రామంలోని వారు ఇంటికి కొంత డబ్బులు చందా జమ చేస్తారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో చిరుతల రామాయణ ప్రదర్శన కొనసాగుతాయి.

సాధన చేసేవారిలో రైతులు, కూలీలు, ప్రజాప్రతినిధులు కూడా ఉంటున్నారు.

మూడుసార్లు శిక్షణ ఇచ్చా..



చిరుతల రామాయణం అంటే ప్రాచీన కళ, సనాతన ధర్మాన్ని కాపాడేది. నేను మా పెద్దల వద్ద నేర్చుకున్నాను. పాత్రలు కూడా పోషించాను. ఇప్పటి వరకు నేను చిరుతల రామయణంపై మూడుసార్లు శిక్షణ ఇచ్చాను. మా గ్రామంలో మార్చి 25 నుంచి చిరుతల రామాయణం ప్రదర్శన ఉంది.

– గోదరి రాజయ్య, శిక్షకుడు, కాచన్‌పల్లి

రాముని పాత్ర పోషించడం అదృష్టం



నేను మా ఊరిలో నిర్వహించే చిరుతల రామాయణం ప్రదర్శనలో రాముని పాత్ర కనిపించబోతున్నాను. రాముని పాత్ర పోషించడం అదృష్టంగా భావిస్తున్నాను. ప్రతీరోజు రాత్రి ప్రాక్టీస్ చేస్తున్నాం.

–నరిగె రాజబాపు, కాచన్‌పల్లి, కళాకారుడు

లక్ష్మణుని పాత్ర చేస్తున్నాను



ఎంతో నియమ, నిష్టలతో ఉండి చిరుతల రామాయణం నేర్చుకుని ప్రదర్శిస్తాం. నేను మా ఊరిలో నిర్వహించే చిరుతల రామాయణం ప్రదర్శనలో లక్ష్మణుని పాత్ర చేస్తున్నాను. ప్రతీరోజు రాత్రి సమయంలో ప్రాక్టీస్ చేస్తున్నాం.

– తిరుపతి, కాచన్‌పల్లి, కళాకారుడు

ఆంజనేయుని వేషధారణ



ప్రతీరోజు రాత్రి సమయంలో ప్రాక్టీస్ చేస్తున్నాం. ఆంజనేయుడి పాత్ర పోషించడం అదృష్టంగా భావిస్తున్నా. ఎంతో నియమ, నిష్టలతో ఉండి చిరుతల రామాయణం నేర్చుకుంటున్నాం.

– లింగయ్య, కాచన్‌పల్లి, కళాకారుడు

విభీషణుని పాత్ర..



నేను మా ఊరిలో నిర్వహించే చిరుతల రామాయణంలో విభీషణుని పాత్ర పోషించబోతున్నాను. 20 రోజుల నుంచి శిక్షణ పొందుతున్నాం. వచ్చే నెలలో ప్రదర్శన ఉంటుంది.

–నరిగె లింగయ్య, కాచన్‌పల్లి, కళాకారుడు, మాజీ సర్పంచ్

బాసరలో భక్తుల రద్దీ


క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు

బాసర: నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని దర్శించుకునేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ముందుగా పవిత్ర గోదావరినదిలో పుణ్యస్నానాలాచరించారు. ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో చిన్నారులకు అర్చకులతో అక్షర శ్రీకారం, కుంకుమార్చన పూజలు చేయించారు. మహాకాళి, మహాలక్ష్మి అమ్మవార్లనూ దర్శించుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టినట్లు ఆలయాధికారులు తెలిపారు.

అమ్మవారి ఒక్కరోజు ఆదాయం

ఆదివారం మాఘమాసం శుభముహూర్తం కావడంతో సరస్వతీ అమ్మవారిని భక్తులు అధికసంఖ్యలో దర్శించుకోగా వివిధ సేవల ద్వారా ఆలయానికి రూ.15.46లక్షల ఆదాయం సమకూరింది. రూ.500 అభిషేకాల ద్వారా రూ.70,500, రూ.వెయ్యి అక్షరాభ్యాస టికెట్ల ద్వారా రూ.7.76లక్షలు, రూ.150 అక్షరాభ్యాసాల ద్వారా రూ.46,500, రూ.100 మండప ప్రవేశం ద్వారా రూ.85వేలు, రూ.50 మండప ప్రవేశం ద్వారా రూ.12వేలు, అభిషేకం లడ్డూ ప్రసాదం ద్వారా రూ.2.94లక్షలు, లడ్డూ, పులిహోర ప్రసాదాల ద్వారా రూ.2.62లక్షలు ఆదాయం వచ్చింది.

సమస్యలు పరిష్కరించాలని కేంద్ర మంత్రికి వినతి


వినతిపత్రం ఇస్తున్న 'సమగ్ర' ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని సమగ్ర ఉద్యోగుల సంఘం నాయకులు ఆదివారం జిల్లా కేంద్రానికి వచ్చిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ సమక్షంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రమబద్ధీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. పేస్కేల్ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపితే చర్యలు చేపడతామని పేర్కొన్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పడాల రవీందర్, ప్రియాంక, కవిత, దేవదర్శన్, అర్చన, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వినతి

జిల్లా కేంద్రానికి వచ్చిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని రిమ్స్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కలిసి ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి పేస్కేల్ ఇప్పించే విధంగా చూడాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ఏటా రూ.వెయ్యి ఇంక్రిమెంట్ కల్పించాలని, వెయిటేజీ మార్కులు ఇవ్వాలని, ఉద్యోగి సర్వీసులో మరణిస్తే కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా, మహిళలకు ప్రసూతి సమయంలో వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు బండ శ్రీనివాస్, రవి, రాజు, సంతోష్, జ్ఞానేందర్, శైలేందర్, రవికిరణ్ యాదవ్, ఫేరోజ్, తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- టీజీఈ జేఏసీ ఛైర్మన్ మారం జగదీశ్వర్


ఛైర్మన్‌ను గజమాలతో సన్మానిస్తున్న టీఎన్జీవోస్ నాయకులు, సభ్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అటవీశాఖ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్, టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు, అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. టీఎన్జీవోస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో టీఎన్జీవోస్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా టీఎన్జీఓ ఫారెస్ట్ సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు పొన్న మల్లయ్య, కాళేశ్వరం జోనల్ సెక్రటరీ సుభాష్, జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్, కవ్వాల్ సర్కిల్ రెప్రజెంటేటీవ్ అజర్, అటవీ శాఖ ఉద్యోగ నాయకులు ఆయనను గజమాలతో సత్కరించారు. సిరిసిల్ల పద్మశాలి నేతలతో నేసిన అగ్గిపెట్టెలో పట్టే పట్టు వస్త్రాలను బహూకరించారు. అనంతరం అటవీ శాఖలో ఖాళీగా ఉన్న ఎఫ్‌బీవో పోస్టులను భర్తీ చేయాలని, పోలీస్ శాఖలో వర్తిస్తున్న జీతభత్యాలు అటవీ శాఖలోని యూనిఫాం ఉద్యోగులకు కూడా వర్తింపజేయాలని, పదన్నతులు కల్పించాలని, ఫారెస్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా సీఎం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. స్పందించిన మారం జగదీశ్వర్ జూనియర్ అటవీ ఉద్యోగుల సమస్యలతోపాటు అందరి సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూముల రామ్మోహన్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపు, టీఎన్జీవోస్ సభ్యులు పాల్గొన్నారు.

బ్యాటరీ లైట్లతో వన్యప్రాణుల వేట


పట్టుకున్న నిందితుడితో ఎస్సై శ్యాంపటేల్

వేమనపల్లి:బ్యాటరీ లైట్ల సహాయంతో వన్యప్రాణులను వేటాడుతున్న ఒకరిని నీల్వాయి పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై శ్యాంపటేల్ తెలిపిన వివరాల ప్రకారం.. కల్మలపేట గ్రామానికి చెందిన తోకల జీవన్ కొంత మందితో కలిసి కోటపల్లి మండలం నక్కలపల్లి, చామనపల్లి అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడుతున్నారు. బ్యాటరీ చార్జింగ్ పెట్టి లైట్లు దానికి అనుసంధానం చేసి అటవీ ప్రాంతంలో రాత్రిపూట వన్యప్రాణులను లైట్ వెలుతురు సహాయంతో ట్రాక్ చేసి చంపేస్తున్నారు. పక్కా సమాచారంతో నీల్వాయి ఎస్సై ఆదివారం తెల్లవారుజామున నీల్వాయి బస్టాండ్ సమీపంలో బైక్‌పై వెళ్తున్న జీవన్‌ను పట్టుకున్నాడు. అతడిని తనిఖీ చేయగా అడవి పిల్లి, కుందేలు, జింక కాళ్లు, తల, మాంసం లభ్యమయ్యాయి. బ్యాటరీలు చార్జింగ్ లైట్లు స్వాధీనం చేసుకున్నారు. అతడిని నీల్వాయి అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. వేటాడినవారిలో జీవన్‌తోపాటు కల్మలపేట గ్రామానికి చెందిన ఉంద్రాళ్ల పోశం, ఇంకా కొంత మంది ఉన్నట్లు అటవీ అధికారులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం


కాలిపోయిన ఇల్లు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని లక్సెట్టిపేట గ్రామానికి చెందిన ఉప్పు నర్సయ్య వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉద యం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తా ళం వేసి వ్యవసాయ పనుల నిమిత్తం పంట పొ లానికి వెళ్లారు. విద్యుదాఘాతంతో ఇంట్లో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఇంట్లో ఉన్న బంగారం, నగదు, నిత్యావసర సరుకులు, ఇతర సామగ్రి, వ్యవసాయ పనిముట్లు కాలిపోయాయి. రూ.10లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటోంది.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఉట్నూర్‌రూరల్: బాధిత కుటుంబాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పరామర్శించారు. కుటుంబ సభ్యులను అడిగి ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. తనవంతుగా రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. నాయకులు ఖయ్యుం, దాసండ్ల ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

అ'పూర్వ'ం.. ఆత్మీయం



నస్పూర్ పట్టణ పరిధిలోని సీసీసీ సింగరేణి హైస్కూల్‌లో 1999–2000 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. సీసీసీలోని బొమ్మరిల్లు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సిల్వర్ జూబ్లీ కార్యక్రమంలో 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు జక్కుల మల్లేశ్, తొట్ల బుచ్చన్న, కారుకూరి రవీందర్, శ్రీనివాస్ శర్మ, ధనలక్ష్మి, రమాదేవి, రేఖాఠాగూర్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

– నస్పూర్

బాలిక తండ్రిపై బాలుడి హత్యాయత్నం

- ప్రేమపెళ్లికి నిరాకరించాడని ఘాతుకం
- చికిత్స పొందుతున్న బాలిక తండ్రి
- వివరాలు వెల్లడించిన నిర్మల్ ఏఎస్పీ


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రాజేశ్ మీనా

నిర్మల్‌టౌన్: తాను ప్రేమించిన బాలికతో పెళ్లికి నిరాకరించిన ఆమె తండ్రిపై పగ పెంచుకున్న ఓ బాలుడు అతడిపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా ఆదివారం ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఓ బాలుడు జిల్లా కేంద్రంలోని కొత్త కలెక్టరేట్ కార్యాలయం వద్ద గల డబుల్ బెడ్రూం ఇంటిలో నివసించే ఓ బాలికను ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని ఆమెతో చెప్పగా పెళ్లీడు వచ్చేదాకా ఆగాలని ఆ బాలిక బదులిచ్చింది. దీంతో ఆ బాలుడు నేరుగా బాలిక తండ్రి అబ్దుల్ అజీజ్ వద్దకే వెళ్లి 'మీ కూతురును ప్రేమిస్తున్నాను.. పెళ్లి చేసుకుంటాను' అని చెప్పాడు. బాలిక తండ్రి కూడా పెండ్లీడు వచ్చాకే పెళ్లి చేస్తానని చెప్పాడు. ఈ విషయం నచ్చని బాలుడు అజీజ్‌పై కోపం పెంచుకున్నాడు. ఎలాగైనా అతడిని చంపాలని పథకం పన్నాడు. మొహమ్మద్ తౌసిఫ్ ఉల్ల సహకారం తీసుకుని ఈనెల 22న రాత్రి 10.45గంటలకు సదరు బాలిక ఇంటికి వెళ్లాడు. వెంట తెచ్చుకున్న కత్తెరతో బాలిక తండ్రి కడుపులో పొడిచాడు. ఈ ఘటన నుంచి తప్పించుకున్న అబ్దుల్ అజీజ్‌ను స్థానికులు చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు హత్యాయత్నానికి కారకులైన బాలుడితోపాటు సహకరించిన మొహమ్మద్ తౌసిఫ్‌ను పోలీసులు 24 గంటల్లో చాకచక్యంగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ రాజేశ్‌మీనా, పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని కామోల్ గ్రామానికి చెందిన హంపోలి ప్రభాకర్‌రెడ్డి (42) మద్యానికి బానిసై ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మాలిక్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభాకర్‌రెడ్డి కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తిచెంది శనివారం రాత్రి తన పంట పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతోపాటు కుమారుడు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి..

సిర్పూర్(టి): మండలంలోని పెద్దబండ– వేంపల్లి గ్రామాల మధ్య అటవీప్రాంతంలో గల భీమన్న ఆలయ సమీపంలో ఆదివారం ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు సిర్పూర్(టి) ఎస్సై కమలాకర్ తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పోచమ్మబస్తీ కాలనీకి చెందిన మామిడి వెంకటేశ్(35) ఆలయ సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదని ఎస్సై తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న నలుగురి అరెస్టు


పోలీసుల అదుపులో నిందితులు

ఇంద్రవెల్లి: జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలోని దుర్గనగర్‌కు చెందిన సుక్‌దేవ్ అలియస్ సన్ని (25), రాన్‌మలే గజానంద్ అలియాస్ కిరణ్ (21), టింబుల్‌కర్ కృష్ణ (20), బక్కలే ఆకాశ్ (19) ఈ నెల 21న ఇంద్రవెల్లి మండలంలోని ఈశ్వర్‌నగర్ జై దుర్గవైన్స్‌తో పాటు ఉట్నూర్ మండలంలోని ఎక్స్‌రోడ్ వద్ద ఉన్న రెండు వైన్‌షాపుల్లో, నార్నూర్ మండలంలోని రెండు కిరాణ షాపుల్లో, గాదిగూడ మండలంలోని లోకరి వైన్‌షాపులో చోరీకి పాల్పడ్డారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు ఆదివారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆదిలాబాద్ నుంచి ఉట్నూర్ వైపు వెళ్తున్న నలుగురు యువకులను పట్టుకుని విచారించగా నిజం ఒప్పుకున్నట్లు ఎస్సై తెలిపారు. వారి వద్ద ద్విచక్రవాహనంతో పాటు రూ.2,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. గతంలో తలమడుగు మండల కేంద్రంలోని కిరాణ షాపుతో పాటు జగిత్యాలలో కూడా దొంగతనం చేసినట్లు తెలిపారు. ఆదివారం కూడా దొంగతనం చేయడానికి ముందస్తు రెక్కీ కోసం ఉట్నూర్ వైపు వెళ్తుండగా పట్టుబడినట్లు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై రమేశ్, కానిస్టేబుళ్లు సాయి కిరణ్, హరి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వివాహిత ప్రేమాయణం

- న్యూడ్ కాల్ చేయాలని బ్లాక్‌మెయిల్ చేసిన నిందితుడు
- అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: సోషల్ మీడియాలో యువత కొత్త పుంతలు తొక్కుతోంది. కొంతమంది మితిమీరిన పరిచయాలు పెంచుకుని ప్రేమాయణంతోపాటు అక్రమ సంబంధాలు కొనసాగిస్తున్నారు.. ఆదిలాబాద్ వన్‌టౌన్ సీఐ సు నీల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన ఓ వివాహితకు ఈస్ట్ గోదావరి జిల్లా రాజోల్ మండలం మొర్కపాలెంకు చెందిన బీఫార్మసీ విద్యార్థి నందుల ఆనంద్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. అప్పుడప్పుడు వీడియో కాల్‌చేసి మాట్లాడుకునేవారు. అయితే నిందితుడు వీడియో కాల్ చేసే సమయంలో స్క్రీన్‌షార్ట్ తీసుకునేవాడు. న్యూడ్ కాల్ చేయకపోతే వాటిని సోషల్ మీడియాలో పెడతానని బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించాడు. ఆమె భయపడి న్యూడ్ కాల్ చేయడంతో వాటిని స్క్రీన్‌షార్ట్ తీ సుకొని తనవద్ద ఉంచుకున్నాడు. శారీరకంగా తనను కలవాలని, లేనట్లయితే సోషల్ మీడియాలో వాటిని పోస్టు చేస్తానని భయభ్రాంతులకు గురిచేశాడు. దీంతో సదరు మహిళ ఈనెల 4న వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు నిందితుడిని ఆమె ద్వారా అక్కడి నుంచి పిలిపించి అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. రెండు నెలల క్రితం ఆదిలాబాద్‌కు చెందిన ఓ మైనర్ విద్యార్థినికి హైదరాబాద్‌కు చెందిన యువకుడితో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. తర్వాత ఇంట్లో ఎవరికి చెప్పకుండా అతనితో వెళ్లిపోయింది. పోలీసులు ట్రాప్ చేసి పట్టుకొని నిందితుడిని కటకటాల పాలు చేశారు. సోషల్ మీడియాలో పరిచయాలు పెంచుకొని ప్రేమ పేరిట యువత తప్పుదోవ పడుతున్నారని, ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.